క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణోత్సవం



వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛరణ నడుమ వైభవంగా స్వామివారి కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్: విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేటలోని అడబాల ట్రస్ట్ కార్యాలయంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరకులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ, సమాజ హితం కోసం పింఛను సొమ్ములో కొద్ది మొత్తం సేవా కార్యక్రమాలకు కేటాయిస్తున్న బాపిరాజు సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ సువర్ణరాజు, అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీగా దుమ్ములపేట ఆరోగ్య కేంద్రం

కాకినాడ క్రైం: నగరంలోని దుమ్ములపేటలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆరోగ్య కేంద్రం పూర్తి స్థాయి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)గా అవతరించింది. ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సోమవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. దుమ్ములపేటలో ఆరోగ్య కేంద్రంలో కొన్నాళ్లుగా ఓపీ సేవలు మాత్రమే కొనసాగిస్తున్నారు. తాజాగా పూర్తి స్థాయి వైద్య సదుపాయాలు కల్పించనున్నారు. మెడికల్ ఆఫీసర్, హెచ్‌ఆర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డీఈవోతో పాటు, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ పర్సన్ ఒకరిని నియమిస్తారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మందులు, ల్యాబ్ సౌలభ్యం ఉంటుంది. నంద్యాల జిల్లా దోనె మండలం దోరపల్లికి మంజూరైన యూపీహెచ్‌సీని దుమ్ములపేటకు బదలాయించినట్టు జీవోలో పేర్కొన్నారు.

అంధత్వ నివారణలో రెడ్ క్రాస్ ముందడుగు

బోట్‌క్లబ్: విభిన్న సేవా కార్యక్రమాలతో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉన్న రెడ్ క్రాస్ కాకినాడ జిల్లా శాఖ అంధత్వ నివారణలోనూ ముందడుగు వేసింది. గతేడాది రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ప్రారంభించిన లకంసాని విరీన్ మానస్ రెడ్ క్రాస్ ఐ-బ్యాంకు కార్యకలాపాలు ప్రారంభించి నేటికి సంవత్సరం పూర్తయిందని సంస్థ చైర్మన్ వైడీ రామారావు మంగళవారం విలేకర్లకు తెలిపారు. ఏడాది కాలంలో 158 కార్నియాలను సేకరించి, ఎల్వీ ప్రసాద్, కిరణ్ కంటి ఆస్పత్రుల ద్వారా అంధుల జీవితాల్లో వెలుగు నింపిందని చెప్పారు. నేత్రదానం చేసి అమరులైన వారికి, ఇందుకు సహకరించిన వారి కుటుంబ సభ్యులకు రామారావు కృతజ్ఞతలు తెలిపారు. నేత్రదాన ప్రతిజ్ఞ చేయడం ద్వారా అంధులకు కొత్త జీవితాన్ని ప్రసాదించడానికి ముందుకు రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏడాది కాలంలో రెడ్ క్రాస్ ఐ-బ్యాంకుకు మద్దతు ఇచ్చిన కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, డాక్టర్ జయప్రకాష్ నారాయణ, గజల్ శ్రీనివాస్, ఇతర ప్రముఖులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఉప్పుటేరు వంతెనకు సీవీకే రావు పేరు పెట్టాలి



సీవీకే రావు విగ్రహానికి పూలమాల వేస్తున్న రమణరాజు

బోట్‌క్లబ్: ఉప్పుటేరు మూడో వంతెనకు సీవీకే రావు పేరు పెట్టాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. చిత్తజల్లు వెంకట కృష్ణారావు (సీవీకే రావు) 113వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక సినిమా రోడ్ సంత చెరువు పార్కు వద్ద ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన సీవీకే రావు విదేశాల్లో ఐసీఎస్ (ఐఏఎస్‌కు మించి) ఉన్నత విద్య పూర్తి చేసి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారని కొనియాడారు. కాకినాడ పురపాలక కౌన్సిలర్‌గా, ఎమ్మెల్యేగా ప్రజాహిత ప్రయోజన ఉద్యమాలు చేపట్టి రాష్ట్ర చరిత్రలో కమ్యూనిస్ట్ గాంధీగా నిస్వార్థ సేవలందించిన దేశ భక్తుడని శ్రద్ధాంజలి ఘటించారు. మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా ఏకకాలంలో రెండు ఉన్నత పదవులు నిర్వహించిన ఏకైక ప్రజానేతగా ఖ్యాతి చెందారన్నారు.

కొలువులకు ఆన్‌లైన్

- ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి వెళ్లకుండా రిజిస్ట్రేషన్
- నమోదు చేసుకున్న వారి మొబైల్‌కు ఉద్యోగాల వివరాలు
- గత ప్రభుత్వ చొరవతో నిరుద్యోగులకు ఊతం



జిల్లా ఉపాధి కార్యాలయం

బాలాజీచెరువు: ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డిజిటల్ హంగులను అద్దింది. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు మరింత చేరువ చేయడానికి కొత్త సంస్కరణలు వేసింది. ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి ట్రైనింగ్ శాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వెబ్ పోర్టల్ రెండేళ్ల కిత్రం ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల వివరాలు, ప్రభుత్వ శాఖల్లో జారీ చేసిన నోటిఫికేషన్ల వివరాలు ఇందులో పొందుపరిచారు. నిరుద్యోగ యువత వారి విద్యార్హతలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వెంటనే వారి విద్యార్హత వివరాలు మేరకు ఏ ఉద్యోగాలకు అర్హులో వారి మొబైల్ నంబర్‌తో పాటు, రిజిస్టర్ ఈ-మెయిల్ ఐడీకి సమాచారం అందుతుంది. ప్రైవేట్ కంపెనీల్లో ఖాళీలు భర్తీ చేయడానికి ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాల సమాచారం, ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల ఖాళీల భర్తీకి జారీ చేసే నోటిఫికేషన్ల సమాచారం ఈ వెబ్ సైట్‌లో ఎప్పటికప్పుడు నవీకరణ జరుగుతుంది.

ప్రతి విద్యార్థికి డిజిటల్ కార్డు

ఉపాధి కల్పన శాఖలో ఇప్పటి వరకూ వివరాలు నమోదు చేసుకున్న వారికి గుర్తింపు సంఖ్యతో పాటు, ధ్రువపత్రం ఇచ్చేవారు. ఇకపై ఎంసీసీ విధానంలో కార్డు జారీ అవుతుంది.

విద్యార్హతల వారీగా నమోదు వివరాలు

పదో తరగతిలోపు	229
పదో తరగతి	3,029
ఇంటర్మీడియెట్	5,682
డిగ్రీ	5,628
డిప్లమో	3,430
ఇతర విద్యార్హతలు	12,570

ఆధార్, సెల్ నంబరుతో లాగిన్

ఇంటర్నెట్‌లో ఎంప్లాయిమెంట్ ఏపీ.జీవోవీ.ఇన్‌లో జాబ్ సీకర్‌లో వారి ఆధార్, సెల్ నంబర్ ద్వారా లాగిన్ కావాలి.

- వారి విద్యార్హతలు, వివరాలు నమోదు చేసిన వెంటనే, వారి మొబైల్‌కు సమాచారం వస్తుంది. వివరాలు నమోదు చేసిన వెంటనే సంబంధిత జిల్లా ఉపాధి కార్యాలయానికి ఆ వివరాలు చేరుతాయి.
- ఎంప్లాయిమెంట్ శాఖ కార్యాలయంలో సిబ్బంది ఎప్పటికప్పుడు వాటిని పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉంటే రిజిస్ట్రేషన్ నంబరును అభ్యర్థికి పంపుతారు.
- ఏమైనా వివరాలు తప్పుగా ఉంటే, ఇంకా సమాచారం కావాలన్న ఉపాధి కార్యాలయ సిబ్బంది ఫోన్ ద్వారా వివరాలు తెలుపుతారు.
- ఎంప్లాయిమెంట్ శాఖ కార్యాలయంలో నిర్వహించే విద్యార్హత పత్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు విద్యార్హతల నమోదు వంటి సేవలు ఈ వెబ్ పోర్టల్‌లో అందుబాటులోకి వచ్చాయి.
- ఈ వెబ్ పోర్టల్ రిజిస్ట్రేషన్ చేసుకుంటే కేవలం రెండు రోజుల్లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్డు అందుతుంది.
- ఏ విద్యార్హత లేనివారూ తమ వివరాలు నమోదు చేసుకోవచ్చు. వారికి చదువుతో సంబంధం లేని ఉపాధి కల్పిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి




పదో తరగతి, ఆపై విద్యను అభ్యసించిన ప్రతి విద్యార్థికి ఈ వెబ్ పోర్టల్ ఎంతో ఉపయోగం. విద్యకు తగిన ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో జాబ్‌మేళాలు నిర్వహించి, చదువుకు తగిన ఉపాధి కల్పిస్తున్నాం. అర్హత ఉన్న యువతీయువకులు రిజిస్ట్రేషన్ చేసుకుని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

– జి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి

నేడు 'యువత పోరు'ను విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, కాకినాడ: యువతకు ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి కల్పిస్తామని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చి పది నెలలైనా ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన 'యువత పోరు' కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 9 గంటలకు కాకినాడలోని బాలాత్రిపుర సుందరిదేవి ఆలయం సమీపంలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించి, కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఉదయం 9.30కు 'యువత పోరు' కార్యక్రమం వైఎస్సార్ సీపీ ఆఫీసు నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు ద్వారంపూడి తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

ముక్కు శుభ్రత ఎంతో కీలకం



ముక్కు శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బాలకిరణ్

బోట్‌క్లబ్: ఆరోగ్య విషయంలో ముక్కు శుభ్రత ఎంతో అవసరమని ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు కనుమూరి బాలకిరణ్ అన్నారు. జాతీయ ముక్కు శుభ్రత దినోత్సవం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక దంటువారి వీధిలో ఉన్న బాల చెవి, ముక్కు, గొంతు ఆస్పత్రిలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకిరణ్ మాట్లాడుతూ, ముక్కు పరిశుభ్రత ఆరోగ్యంలో కీలకమైన అంశమని, దీనిని తరచూ నిర్లక్ష్యం చేస్తుంటారన్నారు. కాలుష్య, అలెర్జీ కారకాలు, బ్యాక్టీరియాను ఫిల్టర్ చేయడంలో ముక్కు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ముక్కు ఆరోగ్యంగా పని చేయడానికి రోజూ గోరు వెచ్చని నీటితో ముక్కు శుభ్రం చేసుకోవాలన్నారు. ముక్కు ఆరోగ్యానికి హైడ్రేటెడ్‌గా ఉండటం చాలా అవసరమని, తగినంత నీరు తాగటం వల్ల ముక్కు రంధ్రాలు తేమగా ఉంటాయని వివరించారు. ముక్కు పొడిబారడం, చికాకును నివారిస్తాయన్నారు. ముక్కు సరైన పనితీరు కోసం రోజుకు కనీసం ఎనిమిది గ్లాసుల నీరు తాగాలని లక్ష్యంగా పెట్టుకోవడం శ్రేయస్కరమన్నారు. సిగరెట్ పొగ, బలమైన పరిమళ ద్రవ్యాలు, రసాయనాలు వంటి చికాకు కలిగించే వాటికి గురికావడాన్ని తగ్గించాలని సూచించారు. అవి నాసికా మార్గాలను మంటకు గురి చేస్తాయన్నారు. దుమ్ము, బూజు, నాసికా మార్గాలను చికాకు పెట్టే ఇతర అలెర్జీ కారకాలకు గురికావడాన్ని తగ్గించడానికి పరిశుభ్రమైన వాతావరణంలో జీవించాలన్నారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలకిరణ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వల్లి, సిరాజ్, పద్మావతి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవత ముసాలమ్మకు ప్రత్యేక పూజలు



వేములవాడలో ముసాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

కరప: వేములవాడ గ్రామదేవత ముసాలమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠా వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ దేవత పుట్టింటి వారైన పుణ్యమంతుల అప్పారావు, సూర్యావతి దంపతులు, అత్తింటివారు పాట్నీడి వంశీకులు ముసాలమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. వేములవాడ, పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. కరప డీసీ చైర్మన్ పుణ్యమంతుల సత్యనారాయణ(పీజీ), ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఏర్పాట్లను, అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సారె సమర్పణ

కరప గ్రామ దేవత ఉప్పాలమ్మతల్లి ఆలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిన్నారి మురళీకృష్ణ, గ్రామస్తులు, మహిళలు పూజలు చేశారు. తర్వాత మహిళలు కలశాలతో వివిధ రకాల స్వీట్లు, పండ్లు, సారె పట్టుకుని, గరగ నృత్యాలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా ముసాలమ్మ గుడికి చేరుకున్నారు. అక్కడి ఆలయంలో సారె ఉంచి, కరప గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. వేములవాడ గ్రామస్తులు, ముసాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు కరప నుంచి సారె తీసుకొచ్చిన మహిళలకు స్వాగతం పలికి, ప్రసాద వితరణ చేశారు.

మధ్యాహ్న భోజనం ఆకస్మిక తనిఖీ



ఏపీఎస్పీ జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వినయ్‌మోహన్

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని కార్యక్రమ ఏడీ వై.వినయ్‌మోహన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డించే వంటకాలను ఆయన పరిశీలించి, భోజనం రుచిచూశారు. ఈ సందర్భంగా ఏడీ వినయ్‌మోహన్ మాట్లాడుతూ, కొత్త మెనూ ప్రకారం ఈ పథకాన్ని నిర్వహించాలని చెప్పారు. వంటకాలను వేడిగా ఉండేటట్టు చూడాలన్నారు. రాగి జావ కూడా వేడిగా అందజేయాలన్నారు. మధ్యాహ్న భోజనం ఎక్కువ మంది విద్యార్థులు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం కె.గాయత్రి, ఇతర ఉపాధ్యాయులు ఉన్నారు.

మట్టి తరలింపుపై దేవదాయ అధికారుల తనిఖీ



అరట్లకట్టలో గ్రామస్తులతో కలిసి దేవస్థాన భూమిని పరిశీలిస్తున్న అధికారులు

కరప: మండలంలోని అరట్లకట్టలో దేవదాయ శాఖకు సంబంధించిన భూమి నుంచి మట్టిని అక్రమంగా తవ్వి, తరలిస్తున్నట్టు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన శ్రీఆదికేశవ ఎంబర్ మన్నార్ స్వామి దేవాలయానికి చెందిన పంట భూమి 5.50 ఎకరాలు కరప మండలం అరట్లకట్ట గ్రామంలో ఉంది. ఈ భూమిలోని మట్టిని అక్రమంగా తవ్వి, తరలించుకుపోతున్నట్టు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో దేవదాయ శాఖ నరసాపురం ఈఓ ఆర్‌వీవీఎస్ రామచంద్రకుమార్, కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర, ఈఓలు జి.శివబాబు, ఎం.మురళీవీరభద్రరావు, డి.శ్రీనివాసరావు స్పందించి, మంగళవారం అరట్లకట్ట గ్రామస్తులు, ఫిర్యాదుదారుల సమక్షంలో తనిఖీ చేశారు. ప్రస్తుతం అక్కడ మట్టి తవ్వకాలు జరగడం లేదని గుర్తించారు. అక్కడ దేవస్థాన భూమికి సరిహద్దులో ప్రైవేటు వ్యక్తుల భూమిలో మట్టిని గుట్టగా వేసి ఉంచారు. ఆ మట్టి కూడా గతేడాది తవ్వినట్టు ఉందని, దేవస్థానం భూముల మట్టి కాదని నిర్ధారించినట్టు దేవదాయ శాఖాధికారులు తెలిపారు.

పేద మహిళలకు చేయూత



సైకిల్, కుట్టు మెషీన్ అందజేస్తున్న ట్రస్ట్ బృందం

కాకినాడ క్రైం: ఇద్దరు పేద మహిళల జీవనోపాధికి రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్(1978) ఛారిటబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. కాకినాడకు చెందిన లత, లక్ష్మి అనే మహిళలు వితంతువులు. వీరికి ముగ్గురు, ఇద్దరు చొప్పున పిల్లలు ఉన్నారు. కుటుంబం పెద్ద దిక్కు కోల్పోవడంతో జీవనోపాధి కష్టంగా మారింది. దీంతో వీరు సాయం కోసం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బాదం బాలకృష్ణను ఆశ్రయించారు. వీరి విన్నపం మేరకు ట్రస్ట్ బృందం ఆ మహిళలకు రెండు కుట్టుమెషన్లు అందించింది. అలాగే, పేదవాడైన ఆరో తరగతి విద్యార్థికి ట్రస్ట్ తరఫున సైకిల్ సమకూర్చారు. మంగళవారం కాకినాడలోని డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బాలకృష్ణ సహా ట్రస్ట్ సభ్యులు సీమకుర్తి పాపారావు, వీవీ రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం చైతన్య యాత్ర



37వ డివిజన్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: నగరంలోని 37వ డివిజన్‌లో ప్రజలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ప్రజా చైతన్య యాత్ర డిమాండ్ చేసింది. మంగళవారం రాత్రి 37వ డివిజన్ సుందరయ్య భవన్, టీడీపీ కార్యాలయ పరిసరాల్లో సీపీఎం నాయకులు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీని అమలు చేయాలని కరపత్రాలు పంచుతూ, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు స్థానికంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలు సీపీఎం బృందం దృష్టికి తీసుకెళ్లారు. సులభ్ కాంప్లెక్స్ పరిశుభ్రంగా ఉంచాలని, కొత్తగా పెళ్లయిన వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని, డ్రైనేజీల్లో పూడికలు తీయించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని, బ్లీచింగ్ చల్లించాలని కోరారు. మంచినీరు పరిశుభ్రంగా, సక్రమంగా సరఫరాల చేయాలని, ఇంటి నిర్మాణాలకు రుణాలు మంజూరు చేయాలని, వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చూడాలని, టీడీపీ కార్యాలయం వెనుక వీధిలో కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు కె.నాగజ్యోతి, మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, దుంపల ప్రసాద్, మేడిశెట్టి వెంకటరమణ, సీహెచ్ సతీష్, టి.రాణి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కుమారస్వామి కల్యాణోత్సవం



కుమారస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: నగరంలోని దేవాలయం వీధిలో ఉన్న భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కుమారస్వామికి మంగళవారం రాత్రి వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు కొడమంచిలి కార్తీక్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఈ కల్యాణం జరిపించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. రాత్రి కల్యాణోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. కల్యాణోత్సవం తిలకించేందుకు వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సామర్లకోట రైల్వే స్టేషన్‌కు నేడు జీఎం రాక



సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో ఇన్‌గేట్, అవుట్ గేట్ ఆర్చి పనులు



రైల్వే స్టేషన్ ఆవరణలో చేస్తున్న అభివృద్ధి పనులు

అభివృద్ధి, సాంకేతిక పనుల పరిశీలన

సామర్లకోట: దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే స్టేషన్‌కు మంజూరు చేసిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. జీఎం పర్యటనను పురస్కరించుకుని గత నెల రెండున దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన విషయం విదితమే. ఈ మేరకు బుకింగ్ కౌంటర్ హాల్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం ఆ ప్రదేశం శుభ్రంగా ఉండే విధంగా రంగులు వేయాలని సూచించారు. దాంతో బుకింగ్ కౌంటర్ హాల్‌లో రంగులు వేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. బుకింగ్ హాల్ నుంచి ప్లాట్‌ఫారాలకు రాకపోకలు సాగించడానికి రెండు మార్గాలు ఏర్పాటు చేశారు. గతంలో ఒకే మార్గం ఉండేది.

కొనసాగుతున్న అభివృద్ధి పనులు

అదేవిధంగా ప్రయాణికులు వేచి ఉండటానికి 60 కుర్చీలను ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపై ఏర్పాటు చేశారు. ప్లాట్‌ఫారంపై సీసీ కెమెరాలకు సంబంధించిన పనులు, ఆధునిక ఎలక్ట్రికల్ లైన్ పనులు, స్టేషన్‌లోకి ఇన్‌గేట్, అవుట్ గేట్ పనులు జరుగుతున్నాయి. నూతన సిగ్నల్ వ్యవస్థతో కూడిన కార్యాలయం, విశ్రాంతి భవనం, మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. జీఎం రాకను దృష్టిలో ఉంచుకుని ప్లాట్‌ఫారాలతో పాటు, అన్ని కార్యాలయాలు, పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. రైల్వే స్టేషన్ ఆవరణ విశాలంగా కనిపించే విధంగా సుమారు వందేళ్ల వయస్సున్న చెట్లను సైతం తొలగించారు. ఆయా పనులను రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్(వర్క్స్) రవికాంత్, ఏడీఈఎన్ బి.శివప్రసాద్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.గిరి పర్యవేక్షిస్తున్నారు. రైల్వే జీఎం సాంకేతిక పనుల తనిఖీకి వస్తున్నారని, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి అవకాశం ఉండదని స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు.

మొండి బకాయిదారులకు నోటీసులు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయనున్నామని, బకాయిలున్న ఖాళీ స్థలాల్లో నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, రెవెన్యూ అధికారి శ్యామల మంగళవారం వెల్లడించారు. తన ఆదేశాల మేరకు మంగళవారం మొండి బకాయిదారుల ఖాళీ స్థలాల్లో రెవెన్యూ అధికారులు నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారని కమిషనర్ తెలిపారు. ఇంటి పన్నుల బకాయిలపై రెండు శాతం అపరాధ రుసుం విధిస్తున్నట్టు చెప్పారు. మొండి బకాయిలు పెరిగిపోతే అసలు కంటే వడ్డీ ఎక్కువగా ఉండే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. ఖాళీ స్థలాలకు చెందిన యజమానులు ఇతర ప్రాంతాల్లో ఉంటే, వారికి బంధువులు సమాచారం ఇవ్వాలన్నారు. ఖాళీ స్థలాల బకాయిలు చెల్లించకపోతే స్థలాల అమ్మకాలు, కొనుగోలు ప్రక్రియ నిలిచిపోతుందన్నారు. అటువంటి స్థలాలను మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుంటుందని కమిషనర్ స్పష్టం చేశారు.

ఆపద్బాంధవికి అనారోగ్యం..!

- పది రోజులుగా అందుబాటులో లేని పిఠాపురం 108
- పట్టించుకోని అధికారులు



మరమ్మతులకు గురై కాకినాడలో మూలకు చేరిన పిఠాపురం 108 వాహనం

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అడ్డా అని చెపకొంటున్న పిఠాపురంలో ఆపద్బాంధవికి అనారోగ్యం వచ్చినా పట్టించుకునే నాథులే లేరు. పిఠాపురం 108 గత పది రోజులుగా మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది. దీంతో పిఠాపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)కి పిఠాపురం పట్టణంతో పాటు, వివిధ మండలాల్లో ప్రమాదాలకు గురైన క్షతగాత్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా అత్యవసరమైతే 108 పొరుగు మండలాల నుంచి రావాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో సకాలంలో 108 రాక అనేక మంది రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 108 కూనిరాగాలు తీస్తున్నాయనడానికి ఇదే నిదర్శనం.

సినిమాలు



ఆనంద్ సినిమాస్	: కోర్టు, రారాజు, రాక్షస, తకిట తధిమి తందాన, తండేల్, పుష్ప-2
దేవీ మల్టీప్లెక్స్	: నారీ, కోర్టు, పౌరుషం, కింగ్‌స్టన్, మజాకా, సంక్రాంతికి వస్తున్నాం
లక్ష్మి	: ఛావా
సత్యగౌరి	: కింగ్‌స్టన్
తిరుమల	: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు
సీఅండ్‌సీ	: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సీఅండ్‌సీ-2	: శబ్దం
శ్రీప్రియ	: మజాకా
పద్మప్రియ	: ఛావా